- తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన



వరంగల్ జిల్లా ఖిలావరంగల్ మండలం పడమర కోట ఎస్సీ కాలనీలో తాగు నీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు శనివారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. మూడు రోజులకోసారి సమయపాలన లేకుండా నీళ్లు సరఫరా చేస్తున్నారని మండిపడ్డారు. కాలనీవాసులు నిద్రపోయాక రాత్రి 10 గంటల నుంచి 11 గంటల సమయంలో తాగునీటిని సరఫరా చేస్తున్నారని, దీంతో నీరంతా వృథాగా పోతున్నదని ఆరోపించారు. తాగునీటి సమస్యను పరిష్కరించకపోతే జీడబ్ల్యూఎంసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానికులు సుద్దాల నాగరాజు, బరిగెల రాజు, నలిగంటి కిశోర్, కేషపాక రాజు, గడిపె జగదీశ్, మేకల రాజు, గడిపె లక్ష్మమ్మ, దర్శనాల పాపమ్మ, స్వరూప, మమత, రమారాధిక, మాధవి పాల్గొన్నారు. – ఖిలావరంగల్

# ‘దళితబంధు’ అమలు చేయాల్సిందే

- దళిత సంఘాల డిమాండ్
- కామారెడ్డిలో భారీ ర్యాలీ
- కలెక్టరేట్ ఎదుట ధర్నా



కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు

నిజామాబాద్/జమ్మికుంట, జనవరి 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్రంలో దళితబంధు పథకం ఆగిపోవడంపై దళిత సంఘాలు భగ్గుమంటున్నాయి. ఈ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం కామారెడ్డిలో భారీ నిరసన చేపట్టాయి. రాష్ట్రంలోని దళితుల ఆర్థికాభ్యున్నతి కోసం గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ప్రతిష్ఠాత్మక పథకాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దళితులు నిజాంసాగర్ చౌరస్తా నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ.. దళితబంధు పథకాన్ని రాజకీయ కోణంలో చూడటం, బ్యాంకు ఖాతాల్లో జమ అయిన డబ్బులను ఫ్రీజ్ చేయడం సబబు కాదని రేవంత్‌రెడ్డి సర్కారుకు హితవు పలికారు. ఒక్కో దళిత కుటుంబానికి నేరుగా రూ.10 లక్షల లబ్ధి చేకూర్చే ఈ పథకాన్ని కొనసాగించాలని కోరారు. తొలి విడతలో మంజూరైన యూనిట్లకు డబ్బులు ఇవ్వడంతోపాటు రెండో విడతలో ఎంపికైన లబ్ధిదారులకు యూనిట్లు అందజేయాలని వారు డిమాండ్ చేశారు.

### రెండో విడత నిధులను వెంటనే విడుదల చేయాలి

దళితబంధు రెండో విడత నిధులను వెంటనే విడుదల చేయాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ఈ పథకం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి దండం పెడుతూ శనివారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపాలిటీ 14వ వార్డులో పలువురు లబ్ధిదారులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం లో ఎలాంటి ఆంక్షలు లేకుండా దళితబంధు నిధులు అందించారని, ఇప్పుడు కూడా అదే విధానాన్ని కొనసాగించాలని కోరారు. మొదటి విడత నిధులు వచ్చి 18 నెలలు గడుస్తున్నదని, అధికారుల నిర్లక్ష్యం వల్లే రెండో విడత నిధులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## 28 కేసుల్లో నిందితుడు అరెస్టు

- వైజాగ్ గణేశ్‌ను అరెస్టు చేసిన మహబూబ్‌నగర్ ఆర్పీఎఫ్

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): ఏపీలోని విశాఖలో మోస్ట్ వాంటెడ్ చైన్ స్నాచర్, దొంగ.. మైచర్ల గణేశ్‌ను మహబూబ్‌నగర్ రైల్వే ప్రొటెక్షన్‌ఫోర్స్ (ఆర్పీఎఫ్) పోలీసులు అరెస్టు చేసినట్టు రైల్వే అండ్ రోడ్ సేఫ్టీ డీజీ మహేశ్ భగవత్ శనివారం మీడియాకు వెల్లడించారు. హైదరాబాద్‌లో సెంట్రింగ్ పని చేసే గణేశ్‌పై ఆంధ్రప్రదేశ్‌లో 28 కేసులు ఉన్నట్టు చెప్పారు. శుక్రవారం మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా కనిపించిన గణేశ్‌ను అదుపులోకి తీసుకొని వేలిముద్రలు తనిఖీ చేయగా.. ఏపీలో అతడిపై నమోదైన కేసులు వివరాలు తెలిసినట్టు పేర్కొన్నారు. మూడేండ్ల క్రితం తెలంగాణకు వచ్చిన గణేశ్.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలానికి చెందిన లక్ష్మిని పెండ్లి చేసుకున్నాడు. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా శివరాంపల్లిలో అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు.

# ఔషధ వనం అంతర్ధానం!





> మొదటిపేజీ తరువాయి...

ప్రకటిస్తామని తెలిపారు. రాడార్ కేంద్రం కోసం 2,900 ఎకరాల అటవీ భూమిలో 12 లక్షలకుపైగా వృక్షాలను నరికివేయబోతున్నారు. ఆ చెట్లను, అడవిని ఆవరించుకొని ఉన్న వెలకట్టలేని ఔషధ మొక్కలను కూడా ధ్వంసం చేయబోతున్నారని పర్యావరణవేత్తలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ‘వికారాబాద్ కా హవా.. లాకో మరీజోంకా దవా’ అన్న సామెత ఈ అడవులు వందశాతం అద్దంపడుతాయని ఇక్కడ ఔషధ మొక్కలపై పరిశోధన చేసిన నిపుణుల బృందం కూడా చెప్తున్నది. వికారాబాద్ అడవులు, ఇక్కడ దొరికే ఔషధ మొక్కలపై అనేక పరిశోధనలు జరిగాయి. ఇక్కడి ఔషధ మొక్కలపై జరిగిన ఓ పరిశోధన ‘బులెటిన్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్, ఫార్మకాలజీ అండ్ లైఫ్ సైన్స్ 2017’లో ప్రచురితమైంది. ‘రంగారెడ్డి జిల్లా వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి అటవీ ప్రాంతంలో లభించే ఔషధ మొక్కలు–జీవవైవిధ్యం’ పేరుతో ఈ నివేదికను ప్రచురించారు. వికారాబాద్‌లోని ఎస్ఏపీ కాలేజీలో వృక్షశాస్త్ర విభాగం, మహారాష్ట్రలోని వాశీం జిల్లాలో ఉన్న పుష్పదేవ్ పాటిల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ వృక్షశాస్త్ర విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగాలకు చెందిన ఎన్ రామకృష్ణ, కేఎం రంజల్కర్, సీహెచ్ సైదులు బృందం వికారాబాద్ అడవుల్లో పరిశోధన చేసింది. 2017 ఆగస్టు 19వ తేదీన వారి పరిశోధన పత్రం ప్రచురితమైంది.

### ఒకేచోట అనేక ఔషధాలు

అద్భుతమైన ఔషధ మొక్కలకు వికారాబాద్ అడవులు నిలయమని ఈ పరిశోధకులు నివేదికలో పేర్కొన్నారు. ‘దేశంలోని అనేక పర్వత ప్రాంతాల్లో ఔషధ మొక్కలు లభిస్తాయి. కానీ, ఎక్కువ సంఖ్యలో అనేక జాతుల మొక్కలు ఒకే దగ్గర లభించడం అరుదు. 149 రకాల ఔషధ మొక్కల జాతులను ఇక్కడ గుర్తించాం. ఇవి 57 ఔషధ మొక్కల కుటుంబాలకు చెందినవి. తరతరాలుగా స్థానికులు వీటిని ఉపయోగిస్తున్నారు. అద్భుతమైన ఔషధ విలువలు వీటి సొంతం. జంతువులకు సంబంధించిన ఔషధాలు కూడా వికారాబాద్ అడవుల నుంచి లభిస్తాయి. 1946లోనే నిజాం రాజు ఇక్కడ టీబీ చికిత్సకు ప్రత్యేక కేంద్రాన్ని నిర్మించారు’ అని వారు తమ పరిశోధనా పత్రంలో పేర్కొన్నారు. వారు గుర్తించిన ఔషధ మొక్కల సమగ్ర వివరాలను నివేదికలో పొందుపరిచారు. పాము, తేలు కాటు నుంచి రక్షించే మొక్కలతోపాటు దీర్ఘకాల చర్మవ్యాధులు, జీర్ణకోశ సంబంధ వ్యాధులకు, రక్తప్రసరణను మెరుగుపరిచే ఔషధ మొక్కల గురించి వివరించారు. ఈ ప్రాంతంలో లభించే భూగర్భవనరుల గురించి కూడా నివేదికలో తెలిపారు. ముఖ్యంగా మేలురకం సున్నపురాయి నిల్వలు కూడా ఉన్నాయని చెప్పారు. 173 మిలియన్ టన్నుల సున్నపురాయి నిక్షేపాలు ఉన్నట్టుగా అంచనా వేశారు.

### నష్టం అంచనాలే లేవు

వీఎల్ఎఫ్ రాడార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే సమయంలో ఇక్కడి అడవి, స్థానిక పరిస్థితులు, లాభనష్టాలపై కనీస అంచనా వేయలేదని నిపుణులు చెప్తున్నారు. ‘పర్యావరణ ప్రభావ అంచనా’, ‘విపత్తు ప్రమాద అంచనా’, ‘జీవజాతులపై రాడార్ తరంగాల ప్రభావ అంచనా’, ‘ఆర్థిక పరిస్థితుల అంచనా’, ‘వరదల ప్రభావ అంచనా’ వంటివి చేయాల్సి ఉన్నది. ఆ అంచనాలను ప్రజల ఆమోదం కోసం గ్రామసభల్లో పెట్టాల్సి ఉంటుంది. ఔషధ మొక్కల పేటెంట్, వాటి వల్ల జరిగే మేలుపై అంచనాలు రూపొందించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇవేవీ చేయలేదు. రేడియేషన్ వల్ల కలిగే లాభనష్టాల అంచనాలను కూడా ప్రజల ముందు పెట్టలేదు. వీటన్నింటిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

### నేడు చర్చావేదిక

వీఎల్ఎఫ్ రాడార్ కేంద్రంపై చర్చించేందుకు దామగుండం అడవి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10:30 గంటలకు చర్చావేదికను ఏర్పాటు చేశారు. స్థానిక బస్ డిపో ఎదురుగా ఉన్న ఆర్ బాంక్వెట్ హాల్‌లో దీన్ని ఏర్పాటు చేశారు. చర్చావేదికకు పార్టీలకు అతీతంగా అందరినీ ఆహ్వానించినట్టు నిర్వాహకులు చెప్పారు. తమ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, జరిగే దుష్పరిణామాలపై చర్చించేందుకు దీన్ని ఏర్పాటు చేశామని చెప్పారు.


### ప్రకృతిని కాపాడుకోవడం మన ధర్మం



అడవిని, ప్రకృతిని కాపాడుకోవడం మన ధర్మం. ఇక్కడ భారీ వృక్షాలున్నాయి. అనేక ఔషధ మొక్కలకు నిలయం దామగుండం పరిసర అడవులు. 2008–2010 మధ్యకాలంలో ఇక్కడి అడవిలో రాడార్ కేంద్ర ఏర్పాటు అంశం చర్చకు వచ్చినపుడు తీవ్రంగా వ్యతిరేకించాం. అటవీ భూమి బదిలీ నిలిచిపోయిందని భావించాం. కానీ, హఠాత్తుగా రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం, రక్షణ శాఖకు అడవిని బదిలీ చేయడం చకచకా జరిగిపోయాయి. మమ్మల్ని నమ్మించి మోసం చేశారు. మేం న్యాయస్థానాల్లో కూడా పోరాటం చేశాం. అటవీ అధికారులే స్వయంగా 12 లక్షల వృక్షాలను తొలగిస్తున్నట్టు నివేదిక ఇచ్చారు. ఈ నివేదిక ఒక్కటి చాలు ఇది ఎంత పెద్ద అడవో చెప్పడానికి. ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

– సత్యానందస్వామి, దామగుండం

### రేడియేషన్ భారీగా ఉంటుంది



వీఎల్ఎఫ్ రాడార్ కేంద్రం ఏర్పాటుతో ఉత్పన్నమయ్యే రేడియేషన్ వల్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. ఇక్కడి సమస్యలపై మేం స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి అనేకసార్లు చెప్పాం. ధర్నాలు చేస్తాం.. మద్దతు ఇవ్వాలంటే ఇవ్వలేదు. అదిగో.. ఇదిగో అంటూ దాటవేశారు. సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా ఇది. ఆయనకు తెలియకుండానే ఈ తతంగం మొత్తం జరిగిందా? సీఎం దీనిపై జోక్యం చేసుకోవాలి. రాడార్ ఇక్కడ ఏర్పాటైతే కొడంగల్ నియోజకవర్గ ప్రజలకు కూడా నష్టం జరుగుతుంది. మేం ఈ అంశంపై జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను కూడా ఆశ్రయిస్తాం. ప్రజల నుంచి మరోసారి అభిప్రాయాలు సేకరించాలి.

– పోతిరెడ్డిపల్లి రామన్న, దోమ గ్రామం

### గతంలోనే వ్యతిరేకించాం

మా పూడూరు పరిసరాల్లో రాడార్ కేంద్రం పెడ్తామంటే మేం వ్యతిరేకించాం. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే, కలెక్టర్.. ఇతర అధికారులకు కూడా చెప్పాం. కానీ, మా మాట వినలేదు. అడవిని కాపాడుకునేందుకు మళ్లీ పోరాటం చేస్తాం. ఇక్కడ రాడార్ కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల నష్టం తప్ప లాభం లేదు.

–నర్సింహారెడ్డి, ప్రాథమిక సహకార కేంద్రం మాజీ చైర్మన్

# నక్సల్స్‌కు సింహస్వప్నం

- ఎన్‌కౌంటర్ స్పెషలిస్టుగా సౌమ్య మిశ్రాకు గుర్తింపు
- కెరీర్‌లో 96 మంది టాప్ క్యాడర్ నక్సల్స్ అరెస్టు
- 112 మంది నక్సలైట్ల లొంగుబాటుకు చర్యలు
- ఎంసెట్ పేపర్ లీకేజీలో 62 మంది అరెస్టు
- ‘ప్రెసిడెంట్ పోలీస్ మెడల్’తో సత్కరించనున్న కేంద్రం



హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): తెలుగు రాష్ట్రాల్లోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ఐపీఎస్ అధికారిణి సౌమ్య మిశ్రా పేరు ఇప్పటికీ ప్రతిధ్వనిస్తూనే ఉన్నది. ఎన్‌కౌంటర్ స్పెషలిస్టుగా ఆమెకున్న ప్రత్యేక గుర్తింపే ఇందుకు ప్రధాన కారణం. నక్సలైట్లను జనజీవన స్రవంతిలో కలిపేందుకు సౌమ్య మిశ్రా తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు ఆమెకు ఎనలేని కీర్తిని తీసుకొచ్చాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎంసెట్ ప్రశ్నాపత్రం లీకేజీ నిందితులను అరెస్టు చేయడం, మానవ అక్రమ రవాణాను సమర్థంగా అడ్డుకోవడం, స్పెషల్ డ్రైవ్‌లతో చిన్నారులను అక్రమ రవాణా నుంచి కాపాడటం సహా పలు విషయాల్లో ఆమె తనదైన ముద్ర వేశారు. పోలీసు శాఖకు అందించిన సేవలకు గుర్తింపుగా గతంలో అనేక ప్రతిష్ఠాత్మక అవార్డులు, మెడల్స్ అందుకున్న సౌమ్య మిశ్రాను కేంద్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్రపతి విశిష్ట సేవా పతకానికి ఎంపిక చేసింది.

### ఆరంభం నుంచే విశిష్ట సేవలు

1994లో ఐపీఎస్ బ్యాచ్ నుంచి కార్యక్షేత్రంలోకి అడుగుపెట్టిన సౌమ్య మిశ్రా తన కెరీర్‌లో 20 మంది నక్సల్స్‌ను హతమార్చారు. 24 మంది టాప్ క్యాడర్ మావోయిస్టులు, 30 మంది ఇతర క్యాడర్ నాయకులు, 42 మంది వామపక్ష తీవ్రవాదులను అరెస్టు చేయడంతోపాటు ఆయుధాలు, నగదుతో కూడిన 77 డంప్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఆమె చేపట్టిన చర్యల వల్ల వరంగల్‌లో 30, విజయనగరంలో 11, విశాఖపట్నంలో 71 మంది నక్సల్స్ లొంగిపోయారు. ఎంసెట్ పేపర్ లీకేజీ కేసులో 62 మంది నిందితులను అరెస్టు చేసిన సౌమ్య మిశ్రా.. మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్న 80 మందిని అరెస్టు చేసి బంగ్లాదేశ్‌కు చెందిన 81 మంది యువతులను రక్షించారు. స్పెషల్ డ్రైవ్‌ల ద్వారా 9,125 మంది చిన్నారులకు వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించారు. 2004లో ఆంత్రిక్ సురక్షా సేవా పతక్, 2013లో ఇండియన్ పోలీస్ మెడల్, 2018 లో టెక్నాలజీ సభ అవార్డు, 2019లో ఇన్ఫో కం ఇండియా అవార్డు, 2021లో డీజీ ఫైర్ సర్వీసెస్ అవార్డు (ఒడిశా), 2022లో డీజీ కమెండేషన్ (భారత ప్రభుత్వం) అవార్డు, 2023లో అతి ఉత్కృష్ట్ అవార్డు కైవసం చేసుకున్న సౌమ్య మిశ్రాను ఈ ఏడాది రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం వరించింది.

